క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో పదవిపై హర్షం



మురళీకృష్ణారెడ్డి

వరికుంటపాడు: మండలంలోని విరువూరుకు చెందిన ముడియాల మురళీకృష్ణారెడ్డి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ జోనల్ జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో తనకు పదవీ బాధ్యతలను అప్పగించడంపై హర్షం వ్యక్తం చేశారు. తనకు పదవీ బాధ్యతలను అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, అందుకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, యువ నాయకుడు అభినవ్‌రెడ్డి, ఉదయగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ అలీఅహ్మద్, వరికుంటపాడు మండల కన్వీనర్ తిరుపతి నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా బలోపేతానికి కష్టపడి పని చేస్తానని పేర్కొన్నారు.

బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలి



వరికుంటపాడు: బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ హేమంత్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు కొత్త ఓటర్ల నమోదును పక్కాగా పరిశీలించి చేపట్టాలన్నారు. మరణించిన వారి ఓట్లను గుర్తించి తొలగించాలన్నారు. మార్పులు, చేర్పులను పక్కాగా చేపట్టి ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని సూచించారు.

పొదుపు రుణాలను సకాలంలో చెల్లించాలి



ఉదయగిరి: స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం శారా స్రవంతి కోరారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో వెలుగు సిబ్బందితో గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సభ్యులు తీసుకున్న రుణాలను జీవనోపాధికి సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లిస్తే మరింత మందికి రుణ సౌకర్యం కల్పించే అవకాశం కలుగుతుందన్నారు. సీసీలు గ్రామాల్లోని పొదుపు సభ్యులకు అవగాహన కల్పించి రుణాల రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. సీసీలు, వీఓఏలు, సంఘబంధాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

సీతారామపురం : చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక కోటవీధిలోని స్పెషల్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పిల్లలకు ఆటలతో ఆంగ్ల పదాలను సులభరీతిలో నేర్పించడంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు రాగిజావతో పాటు మెనూ ప్రకారంనాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు.

ఉదయగిరి పంచాయతీలో ఆడిట్ నిర్వహణ

ఉదయగిరి: ఉదయగిరి మేజర్ పంచాయతీ కార్యాలయంలో జిల్లా ఆడిట్ అధికారులు గురువారం ఆడిట్ నిర్వహించారు. అసిస్టెంట్ తనూజ, సీనియర్, జూనియర్ ఆడిట్ అధికారులు కోటేశ్వరరావు, సాయికుమార్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ నిధుల జమ, ఖర్చుల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ కరిముల్లా పాల్గొన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

ఉదయగిరి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 17న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ మూలే పద్మజ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

గుంతలు పూడ్చాలని వినతి

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 7, 8 వార్డుల్లోని అంతర్గత రోడ్లు గుంతలమయంగా తయారయ్యాయని, వాటిని పూడ్పించాలని సీపీఎం నాయకులు మున్సిపల్ కమిషనర్ జీ గంగా ప్రసాద్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. టెంకాయతోపు, తూర్పువీధి, అలఘనాథ స్వామి ఆలయం వెనుక ప్రాంతం, పాత ప్రగతి పాఠశాల, పాత పోస్టాఫీసు వీధి, తదితర ప్రాంతాల్లో పర్యటించి రోడ్ల గుంతలను ఫొటోలు తీసి వినతి పత్రానికి జతచేసి కమిషనర్‌కు అందజేశారు.



చుక్కనీరు లేని అనుమసముద్రం చెరువు



ఆర్ 49 వద్ద చుక్కనీరు లేని ఉత్తర కాలువ

సోమశిల కళకళ.. చెరువులు వెలవెల

నిండు కుండలా సోమశిల జలాశయం

- ఉత్తర కాలువ విస్తరణ పనుల పేరుతో చెరువులకు నీటి విడుదలలో జాప్యం
- మేత, తాగునీటి కోసం అల్లాడుతున్న పశువులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలంలోని చెరువులు చుక్కనీరు లేక వెలవెలబోయి దర్శనమిస్తున్నాయి. సోమశిల నిండుకుండలా ఉన్నా ఉత్తర కాలువ విస్తరణ పనుల పేరుతో నీటిని విడుదల చేయకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో మేత, నీరు దొరక్క పశువులు అల్లాడుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతల ఎదురుచూపులు

మెట్టప్రాంతమైన ఏఎస్‌పేట మండలంలోని చెరువులకు ఉత్తరకాలువ ద్వారా సాగునీటిని ఎప్పుడు విడుదల చేస్తారోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు. ప్రస్తుతం జలాశయంలో 71 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం పూర్తి సామర్థ్యానికి చేరుకుంటే రెండుమూడ్రోజుల్లో క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది. అయినా ఉత్తర కాలువ ద్వారా చెరువులకు సాగునీటిని విడుదల చేయకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏఎస్‌పేట మండలంలో 33 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల కింద దాదాపు అధికారికంగా 10వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి తోడు మరో మూడు వేల ఎకరాల్లో అనధికారికంగా రైతులు వరి పంటను పండిస్తారు. అయితే చెరువుల్లో నీరు లేకపోవడంతో ఎడగారులో కేవలం 500 ఎకరాల్లోనే వరి పంటను సాగుచేశారు. మండలంలోని రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. మండలంలో వర్షాకాలంలో కూడా వర్షపాతం తక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రబీ సీజన్ వరకు ఇరిగేషన్ అధికారులు ఎదురు చూడకుండా ఉత్తర కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తే చెరువుల్లో పుష్కలంగా సాగునీరు ఉంటుంది. సోమశిల జలాలను వృథాగా సముద్రం పాలు చేయకుండా చెరువులను నింపితే పశువులకు మేత, తాగునీరు లభిస్తుంది. భూగర్భజలాలు వృద్ధి చెంది బోర్లలో నీరు పుష్కలంగా లభిస్తుందని రైతులు చెబుతున్నారు. కానీ ఐఏబీ సమావేశం, ఉత్తర కాలువ విస్తరణ పనులు అంటూ అధికారులు నీటిని విడుదల చేయకుండా కాలం వెళ్లదీస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి ఉత్తర కాలువ ద్వారా చెరువులకు సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

చెరువుల్లో చుక్కనీరు లేదు



అనుమసముద్రం చెరువులో చుక్కనీరు లేకపోవడంతో ఎడగారులో వరి పంట పండించలేదు. చెరువులో నీరు లేకపోవడంతో పొలాల్లోకి తోలుకెళ్లిన పశువులకు సైతం వెంటనే ఇంటికి తోలుకుని వస్తున్నాం. రబీ సీజన్‌కు ముందే చెరువులకు నీటిని విడుదల చేస్తే పచ్చరొట్ట పైర్లు, పశువుల మేత వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అధికారులు స్పందించి చెరువులకు సాగునీరు విడుదల చేయాలి.

– సంకర రవీంద్రారెడ్డి, రైతు, అనుమసముద్రం

ఏఎస్‌పేట పీహెచ్‌సీలో ఏడీఎంహెచ్‌ఓ విచారణ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట పీహెచ్‌సీలో కావలి ఏడీఎంహెచ్‌ఓ బ్రిజిత గురువారం విచారణ చేపట్టారు. గతంలో వైద్యశాలలో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న లత, లక్ష్మికి మధ్యన వివాదం నెలకొంది. దీనికితోడు అదే పీహెచ్‌సీలో పనిచేస్తున్న దొరసానమ్మ, లక్ష్మి మధ్యన కూడా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో లక్ష్మి దొరసానమ్మ ఆత్మహత్యాప్రయత్నాలు చేయగా వేరే ప్రాంతాలకు బదిలీ చేశారు. అయినప్పటికీ లక్ష్మి అనే స్టాఫ్ నర్సు మిగిలిన ఇద్దరిపై గత కొద్ది రోజుల క్రితం స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏడీఎంహెచ్‌ఓ బ్రిజితను విచారణాధికారిగా నియమించగా విచారణ చేపట్టారు. కాగా రెండేళ్లుగా పీహెచ్‌సీలో కాంట్రాక్ట్ బేసిక్‌పై విధుల్లో చేరిన లక్ష్మి తనతోటి సిబ్బందిపై ఏదోక రూపంలో జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేస్తూనే ఉంది. అదే పనిలో భాగంగా లత, దొరసానమ్మపై ఇప్పటి వరకు 115 సార్లు స్పందనలో ఫిర్యాదు చేయడం విశేషం. ఆమె ఇన్నిసార్లు ఫిర్యాదులు చేస్తున్నా జిల్లా వైద్య సిబ్బంది ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.

తాళమేసిన ఇంట్లో చోరీ

కావలి (జలదంకి): తాళమేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన కావలి మండలం ఆముదాలదిన్నె పంచాయతీ దూదేకులపాళెంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు.. అన్నగారిపాళెం పంచాయతీ పూలదొరువులో శ్రీనిలయం దేవస్థానాన్ని నిర్వహిస్తున్న పవన్‌స్వామి.. దూదేకులపాళెంలో నివాసంలో ఉండేవారు. అయితే గ్రామంలో అతని వద్ద పని చేసిన వారితో విభేదాలు ఉండటంతో నివాసానికి తాళాలేసి కావలిలో ఆర్నెల్లుగా ఉంటున్నారు. ఈ తరుణంలో ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని గ్రామస్తులు సమాచారమివ్వడంతో పవన్‌కుమార్, భార్య రజనితో కలిసి వచ్చి లోపల పరిశీలించారు. పూజాగదిలోని అమ్మవారి బంగారు విగ్రహం, నాలుగు కిలోల వెండి కవచాలు, రూ.47 లక్షలకు సంబంధించిన ప్రామిసరీ నోట్లు, చెక్కులు, డాక్యుమెంట్లు చోరీకి గురయ్యాయనే అంశాన్ని గుర్తించారు. 50 ఇంచుల టీవీ, వంట సామగ్రి సైతం చోరీకి గురైంది. ఘటనపై కావలి రూరల్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

వింజమూరు(ఉదయగిరి): డీఎస్సీ–2003 రాష్ట్ర ఫోరం ఇచ్చిన పిలుపు మేరకు అప్పటి ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వింజమూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఎస్‌కే హమీద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2003కు ముందు నోటిఫికేషన్ ఇచ్చి ఆ తరువాత విధుల్లో చేరిన వారికి కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. 2003 నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు సాధించిన తాము 2005లో విధుల్లో చేరామని, తాము పాత పెన్షన్ విధానానికి అర్హులమని తెలిపారు. సంఘం నేతలు పి.మాలకొండయ్య, మాల్యాద్రి, చినబాబు, వీరరాఘవులు, కామాక్షమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

సంగం బ్యారేజ్ నుంచి రెండు వేల క్యూసెక్కుల విడుదల

సంగం: సంగం బ్యారేజ్ నుంచి దిగువకు 2వేల క్యూసెక్కులను గురువారం విడుదల చేశారు. సోమశిల జలాశయం నుంచి సంగం బ్యారేజ్‌కు 1850 క్యూసెక్కులు వస్తున్నాయి. దీనికి తోడు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షంతో మరో 1500 క్యూసెక్కులు సంగం బ్యారేజ్‌లో చేరుతున్నాయి. దీంతో దిగువకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. నీటి విడుదల ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున పెన్నా నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సోమ్లానాయక్, ఇరిగేషన్ ఏఈ వినయ్ హెచ్చరించారు. పశువుల కాపర్లు, మత్స్యకారులు పెన్నానదిలోకి దిగవద్దని సూచించారు.



మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలి



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

ఆత్మకూరు: గ్రామీణులకు మెరుగైన విద్యుత్ సరఫరాను అందించడమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ అన్నారు. ఆత్మకూరు డివిజన్ విద్యుత్ అధికారులు, సిబ్బందితో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులతో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు. విద్యుత్ వినియోగంపై సూచనలు చేయాలని కోరారు. జిల్లాలో మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్న సిబ్బంది, అధికారులను గుర్తించి అభినందిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలన్నారు. సౌర విద్యుత్‌ను ప్రోత్సహించాలని సూచించారు అనంతరం డివిజన్ పరిధిలో ఉత్తమ సేవలు అందించిన పలువురు సిబ్బందిని అభినందించి శాలువాలతో సత్కరించారు. ఆత్మకూరు డివిజన్ ఈఈ భాను నాయక్, డీఈఈ చిన్నస్వామి నాయక్, కలిగి ఏడీఈ కృష్ణమోహన్, ఏఓ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి బీజేపీ సేవా పక్షోత్సవాలు

సీతారామపురం : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు సేవా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ నాయకుడు ముడమాల రమేష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన సీతారామ పురం మండలంలో పర్యటించారు. బీజేపీ శ్రేణులతో సేవా పక్షోత్సవాలపై సమీక్షించారు. సేవా పక్షోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు, మేధావులతో సమావేశాలు, మోదీ డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శన, జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ, నమో మారథాన్, పండిట్ దీన్‌దయాల్ జీవితం, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ, స్వచ్ఛత అభియాన్, వికసిత్ భారత్‌పై చిత్రలేఖన పోటీలు, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బూత్, మండల, జిల్లాస్థాయిలో నిర్వహించే సేవా పక్షోత్సవాలను బీజేపీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.327

మర్రిపాడు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకు గరిష్టంగా రూ.327 ధర పలికింది. వేలానికి 720 బేళ్లు రాగా, 436 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.327, కనిష్టంగా రూ.110, సగటున రూ.204.50 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.320 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 450 బేళ్లను తీసుకురాగా, 309 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.320, కనిష్టంగా రూ.109, సరాసరిన రూ.263.14 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

కావలి వీఎస్‌యూ కళాశాలలో బీఫార్మసీ కోర్సు ప్రారంభం

వెంకటాచలం: కావలిలోని వీఎస్‌యూ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి బీఫార్మసీ కొత్త కోర్సును ప్రారంభిస్తున్నట్లు వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కే సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు ప్రారంభంతో ప్రాంతీయ విద్యార్థులు ఇకపై దూరప్రాంతాలకు వెళ్లకుండానే కావలిలోనే చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు.కోర్సులో చేరదలచిన విద్యార్థులు ఏపీ ఎంసెట్–2025 కౌన్సెలింగ్‌లో వీఎస్‌యూ పీఎస్ఎఫ్ కళాశాల కోడ్ పీహెచ్‌ఎం కోర్సు అనే వెబ్‌ఆప్షన్‌ను ఎంచుకుని చేరవచ్చునని వివరించారు. నాలుగేళ్ల బీఫార్మసీ కోర్సుకు ఫీజు ఏడాదికి రూ.60వేలు కాగా, ఫీజురీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థులు ఉచితంగా చదవవచ్చునని తెలిపారు.

బాణసంచా బాధితులకు పరామర్శ

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రంలో జరిగిన బాణసంచా ప్రమాదంలో గాయపడిన చిన్నారులను ఉదయగిరి నియోజకవర్గ బీసీ, యాదవ సంఘ నేతలు గురువారం పరామర్శించారు. ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి బాధితులకు రూ.2 లక్షల చొప్పున అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. బాధితుల్లోని ఆరుగురు బాలికలకు త్వరలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో ప్లాస్టిక్ సర్జరీ చేయించేందుకు చర్యలు చేపడుతున్నట్లుగా వారు తెలిపారు.

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

మర్రిపాడు: చుంచులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గ్రామానికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం ముక్కు ప్రమీల తన భర్త శ్రీనివాసులు జ్ఞాపకార్థంగా నగదు ప్రోత్సాహకాలను గురువారం అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు వరుసగా రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున నగదును అందజేశారు. అలాగే కంచి ఉపేంద్రనాథ్ జ్ఞాపకార్థంగా సోదరి కంచి అరుణ గతేడాది ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. హెచ్‌ఎం విజయ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచేందుకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న దాతలను అభినందించారు. విశ్రాంత ఎంఈఓ జొన్నా సత్యనారాయణ, ఉపాధ్యాయులు వెంకట రమణయ్య, పెంచలరావు, మల్లికార్జున స్వామి, బాలాజీ, తిరుపాలు, రహీమ, రాజేంద్రకుమార్, శ్రీనివాసులు, సునీత, తదితరులు పాల్గొన్నారు.



400 గోకులం షెడ్లు మంజూరు

ఉదయగిరి రూరల్: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద ఉదయగిరి క్లస్టర్ పరిధిలోని 8 మండలాలకు 400 గోకులం షెడ్లు మంజూరయ్యాయని ఏపీడీఓ మృదుల తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 50 చొప్పున గోకులం షెడ్లు మంజూరయ్యాని తెలిపారు. పశుసంవర్థక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన రైతుల జాబితాను తయారు చేసి అందజేస్తారని చెప్పారు. ఆ జాబితా ప్రకారం ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించి పరిపాలన ఆమోదం వచ్చిన వెంటనే నిర్మాణాలు చేపడుతామన్నారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ అప్పాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధి ఏపీడీ మృదుల

సమస్యలను పరిష్కరించాలని వినతి

ఉదయగిరి రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లాకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయపాలన లేని, ఒత్తిడితో కూడిన విధుల నుంచి తమకు విముక్తి కల్పించాలన్నారు. తమను మాతృ శాఖలకు అప్పగించాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆరేళ్లుగా ఒకే కేడర్‌లో పనిచేసిన వారికి ప్రత్యేక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు ప్రస్తుతం అమలవుతున్న రికార్డు అసిస్టెంట్ కేడర్‌ను జూనియర్ అసిస్టెంట్‌గా మార్పు చేయాలన్నారు. తమ సమస్యలను 15 రోజులకు పరిష్కరించకపోతే దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యుదాఘాతంతో నలుగురు కూలీలకు గాయాలు

జలదంకి: మండలంలోని జమ్మలపాళెం సమీపంలోని కేవీఆర్ కన్వెన్షన్ ఆర్చికి మరమ్మతులు చేపడుతుండగా 11 కేవీ విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తగలడంతో నలుగురు కూలీలు గాయాలపాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. కేవీఆర్ కన్వెన్షన్ వద్ద సెక్యూరిటీ గార్డు అరుణ్‌కుమార్, ఆదిరెడ్డిపాళెనికి చెందిన వెంచయ్య, బుడంగుంట కాలనీకి చెందిన లక్ష్మమ్మ, కావలి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సుబ్బరత్నమ్మ ఆర్చికి మరమ్మతు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ట్రాలీ నిచ్చెనను పక్కకు జరుపుతుండగా 11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో నలుగురికి గాయాలయ్యాయి. దీంతో వారిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. జలదంకి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిళ్ల ఢీ

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు

కావలి (జలదంకి): ముందు వెళుతున్న మోటార్‌సైకిల్‌ను వెనుకగా మరో మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన ముసునూరు బ్లూమూన్ దాబా వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాలు..ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని గోపాల్‌నగర్‌కు చెందిన సాయిసూర్య (27) లిక్కర్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం బుచ్చిరెడ్డిపాళెం మండలం యల్లాయపాళెంలో జరిగిన బంధువుల కర్మక్రియకు హాజరయ్యాడు. అనంతరం మోటార్‌సైకిల్‌పై సింగరాయకొండకు బయలుదేరాడు. ఈ క్రమంలో ముసునూరు బ్లూమూన్ దాబా సమీపంలోకి రాగానే గౌరవరానికి చెందిన ఉప్పు నాగరాజు గౌరవరం నుంచి కావలికి మోటార్‌సైకిల్‌పై వస్తూ వెనుకగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సాయిసూర్య అక్కడికక్కడే మృతి చెందగా, నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా సాయిసూర్యకు భార్య కావ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కావలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణం సూపర్‌వైజర్‌పై దాడి

కావలి (జలదంకి): కావలి మండలం రుద్రకోటలోని మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సందీప్‌పై గుడ్లూరుకు చెందిన ఓ వ్యక్తి బీరు సీసాతో దాడికి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు..రుద్రకోటలోని మద్యం దుకాణం కౌంటర్‌లో ఉన్న వ్యక్తితో గుడ్లూరుకు చెందిన ఓ వ్యక్తి గొడవకు దిగాడు. ఈ క్రమంలో సూపర్‌వైజర్ సందీప్ జోక్యం చేసుకుని ఎందుకు గొడవ పడుతున్నావని ప్రశ్నించగా గుడ్లూరుకు చెందిన వ్యక్తి బీరు సీసాతో తలపై బలంగా దాడి చేసి పరారయ్యాడు. దీంతో సందీప్‌కు రక్తగాయమవగా చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటి వద్ద బాధితులు

వింజమూరు(ఉదయగిరి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వింజమూరు మండలం ఊటుకూరు పంచాయతీ ఇందిరానగర్ ఎస్టీ కాలనీలో పూరిల్లు దగ్ధమైంది. వివరాలు.. కాలనీకి చెందిన తలపల ప్రసాద్ తన భార్యాపిల్లలతో కలిసి పొలం పనులకు ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో వెళ్లారు. ఈ క్రమంలో షార్ట్ సర్క్యూట్ సంభవించి పూరి గుడిసెకు మంటలంటుకున్నాయి. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న సిలిండర్ పేలడంతో వస్తువులతో పాటు ఇంటి గోడలు సైతం కూలిపోయాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు సమాచారమిచ్చారు. వారొచ్చి మంటలను ఆర్పేశారు.

15 నుంచి గాలికుంటు నివారణ టీకాలు

సీతారామపురం: ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ తెలిపారు. మండలంలోని అయ్యవారిపల్లి, సీతారామపురం బిట్–1 రైతుసేవా కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి పశువైద్య సేవలపై ఆరా తీశారు. గాలికుంటు నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని వెటర్నరీ అసిస్టెంట్లకు సూచించారు.

వర్షం.. రైతన్న ఆందోళన



వర్షంతో నీటమునిగిన వరి

దగదర్తి: మండలంలో భారీ వర్షం పడటంతో అన్నదాతలు కుదేలయ్యారు. మండలంలో సుమారు 7500 ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఎక్కువ శాతం కోత దశలో ఉంది. అకాల వర్షంతో నీట మునిగిన వరిని చూసి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల స్పందించి నీట మునిగిన వరిని పరిశీలించి నష్టపరిహారాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

దర్గాలో విచారణ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో విచారణను విశ్రాంత ఏఎస్పీ సర్కార్ గురువారం చేపట్టారు. చిన్న దర్గాకు వెళ్లే మార్గంలో ఓ గోడను వక్ఫ్ బోర్డు సిబ్బంది కొద్ది నెలల క్రితం తొలగించారు. ఈ క్రమంలో హైకోర్టును ఓ వ్యక్తి ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా ఎన్నో ఏళ్ల క్రితం పెద్ద దర్గా నుంచి చిన్న దర్గాలకు వెళ్లేందుకు రహదారి ఉండేది. దీని మీదుగా భక్తులు చిన్న దర్గాకు వెళ్లడమే కాకుండా పక్కనున్న శ్మశాన వాటికకు సైతం మృతదేహాలను తీసుకెళ్లేవారు. అయితే రహదారిని దర్గా సజ్జదా హఫీజ్ పాషా ఏడాది క్రితం మూయించారు. ప్రస్తుతం ఉన్న వక్ఫ్ బోర్డు అధికారులు ఆ గోడను తొలగించడంతో హైకోర్టును ఆశ్రయించారు. స్థానికులతో విచారణాధికారి చర్చించారు. వివరాలను కోర్టుకు సమర్పించనున్నామని తెలిపారు.

రోబోటిక్స్ తయారీపై అవగాహన

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు రోబోటిక్స్ తయారీపై బుధ, గురువారాల్లో అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు బోయిళ్ల జనార్దన్‌రెడ్డి, వాయుగుండ్ల బాబు సహకారంతో సిద్ధార్థ్ అనే శాస్త్రవేత్తను పిలిపించి విద్యార్థులకు రోబోటిక్స్ తయారీ విధానంపై రెండ్రోజుల పాటు అవగాహన కల్పించామని హెచ్‌ఎం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.